అభివృద్ధి పనులు త్వరలో పూర్తిచేయిస్తా..

• జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఇందిరానగర్ ఫేజ్-2 కాలనీవాసులు

బంజారాహిల్స్, డిసెంబర్ 17: రహ్మత్‌నగర్ డివిజన్ ఇందిరానగర్ ఫేజ్-2 కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పైపులైన్ పనులతో సహా ఇతర అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తిచేయిస్తామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హామీ ఇచ్చారు. ఆదివారం కాలనీ అసోసియేషన్ నేతలు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ కాలనీలో సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులన్నీ త్వరలో ప్రారంభమవుతాయన్నారు. కాగా తమ కాలనీలో సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కోరగా జనవరిలో జరుపుకోవాలని సూచించారు. పోచమ్మ, సాయిబాబా ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు రమేశ్ ముదిరాజ్, వెంకన్న, శ్రీనివాస్, అంజయ్య. నాగరాజు, రామకృష్ణ పంతులు, రాజు, ఏసురత్నం,శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, జగ్గారావు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

మంత్రి కొండా సురేఖకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న నవీన్ యాదవ్, తదితరులు

జూబ్లీహిల్స్, డిసెంబర్ 17 : రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను ఆదివారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి.నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు వి.ప్రవీణ్‌కుమార్ యాదవ్, గొంటి సాయియాదవ్, తదితరులు ఉన్నారు.

చందానగర్‌లో విద్యుత్ మరమ్మతులు

కొండాపూర్, డిసెంబర్ 17 : చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తారానగర్ ఏఈ సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చందానగర్ హుడాకాలనీలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయిబాబా టెంపుల్ ఏరియా, సిటిజెన్స్ కాలనీ, శివాజీనగర్, భారత్ పెట్రోల్ పంపు వెనుల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

రజక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీసీ దళ్ జాతీయాధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 17 : రజకుల హక్కుల సాధనకు ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని బీసీ దళ్ జాతీయాధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఆదివారం కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో రాష్ట్రస్థాయి రజక సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల అభ్యున్నతికి జాతీయ బీసీ దళ్ కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మేళనంలో శ్రీరామ రజక సంఘం గౌరవాధ్యక్షుడు రాజు, అధ్యక్షుడు సందీప్, లక్ష్మణ్, జానీ, వెంకన్న, ధర్మతోపాలు పలువురు రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రాముఖ్యతను గుర్తించాలి

• శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ • చందానగర్‌లో ఎమ్మెల్యేకు ఘనసన్మానం

వివేకానందనగర్ డివిజన్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన అనంతరం దృశ్యాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన చందానగర్ డివిజన్ వాసులు, కార్పొరేటర్ మంజులారెడ్డి

మియాపూర్ , డిసెంబరు 17: సీసీ కెమెరాలు అలు పెరగకుండా కాపలా ఉంటాయని, వాటి ఏర్పాటును ప్రతి ఒక్కరూ గుర్తించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నిందితులను గుర్తించడంలో పోలీసుశాఖకు సీసీ కెమెరా దృశ్యాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్‌మీర్, సుమిత్రనగర్, మాధవరం నగర్ బీ,సీ బ్లాక్‌ల్లో సీడీపీ నిధులు రూ. 12 లక్షలతో ఏర్పాటు చేసిన 60 సీసీ కెమెరాలను ఆదివారం కార్పొరేటర్ రోజాదేవితో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తన నిధుల నుంచి కోటి రూపాయలను సీసీ కెమెరాల ఏర్పాటుకు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పోలీసు శాఖకు తోడు కాలనీ సంక్షేమ సంఘాలు సైతం సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రంగారావు, సంజీవరెడ్డి, చంద్రకాంత్‌రావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సదా.. మీ సేవలో... : ఎమ్మెల్యే గాంధీ

కొండాపూర్ : ముచ్చటగా మూడో సారి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజల సేవలో సదా ముందుంటానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆదివారం చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజులారఘునాథరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ముచ్చటగా మూడోసారి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తూ గతంలో చేపట్టిన పనులను పూర్తి చేస్తానన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పారిశుధ్య నిర్వహణ

డీసీ, ఏఎంఓహెచ్‌తో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జడ్సీ శ్రీనివాస్‌రెడ్డి

జూబ్లీహిల్స్, డిసెంబర్ 17 : ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పారిశుధ్య నిర్వహణను చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సిబ్బందికి సూచించారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అధికారులతో కలిసి పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లు శుభ్రం చేస్తున్నప్పుడు పారిశుధ్య సిబ్బంది నీల్‌కమల్ ట్రాలీలను విధిగా వినియోగించాలన్నారు. చెత్త కుప్పలు రోడ్లపై పెట్టకుండా ఊడ్చినవెంటనే అందులో వేసుకోవాలన్నారు. దీంతో పాదాచారులు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్మికులు విని యోగిస్తున్న చేతి సంచిలను తొలగించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్, ఏఎంఓహెచ్ డాక్టర్ కేఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యావికాస్ 13వ వార్షికోత్సవం

చెక్కులను అందుకున్న పేద విద్యార్థులతో విద్యావికాస్ ప్రతినిధులు, అతిథులు

ఎర్రగడ్డ, డిసెంబర్ 17: ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన 'విద్యావికాస్' సంస్థ 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కాలనీలోని క్రీడా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ గల పేద విద్యార్థులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కృష్ణశర్మ మాట్లాడుతూ గత 13 ఏండ్లుగా పేద విద్యార్థులకు సంస్థ బాసటగా నిలుస్తున్నదని అన్నారు. ఆదివారం 78 మంది విద్యార్థుల చదువుకు రూ. 2,07,708 చెక్కుల రూపంలో అందించామని వివరించారు. డాక్టర్ పాలకోడేటి రత్నాకర్, ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న విద్యావికాస్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో విద్యావికాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మోహనరావు, ఎంవీ సత్యనారాయణ, విజయానంద్, డి.చంద్రశేఖర్‌రెడ్డి, బద్రుద్దీన్, పేద విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం

స్పోర్ట్స్ ఫెస్ట్‌లో పాల్గొన్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్

కొండాపూర్, డిసెంబర్ 17 : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతాయని శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన'బ్లూ సమ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఫెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పవన్‌కుమార్, శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండా విజయ్, మహేశ్, రఘురామ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోబోటిక్స్ పోటీలకు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాల డైరెక్టర్ కే. విజయరాణి, అధ్యాపకబృందం

దుండిగల్, డిసెంబర్ 17 : శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్, నానక్‌రాంగూడ గచ్చిబౌలిలో ఈనెల 16న నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆవిష్కార్ రోబోటిక్స్ క్రీడాపోటీల లీగ్-23లో వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన ఆరు జట్ల విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కే. విజయరాణి, అధ్యాపక బృందం ఆదివారం అభినందించారు. త్వరలో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి ఫైనల్ రౌండ్‌కు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికవడం అభినందనీయమన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ఎర్రగడ్డ, డిసెంబర్ 17: బోరబండకు చెందిన అక్బరి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. బోరబండ సైట్-1 కాలనీ అక్బరి మసీదు ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 156 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందరికీ మందులను అందజేశారు. ప్రభుత్వ ఈఎన్‌టీ దవాఖానాకు చెందిన ప్రొఫెసర్ బల్బీర్‌సింగ్‌తో పాటు మరో ఆరుగురు వైద్యులు సేవలందించారు. అక్బరి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ జుబేర్, డాక్టర్ చాంద్‌పాషా, మహ్మద్ ఇషాక్‌అహ్మద్, సత్తార్, అబ్దుల్‌రహీం,తదితరులు సహకరించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో ఆదివారం వైదేహి సుభాష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అస్సామీ, మధ్యప్రదేశ్‌లకు చెందిన పలువురు కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో అలరించారు. – కొండాపూర్, డిసెంబర్ 17